క్లుప్తంగా

దిగువ కాలువలకు సాగునీరు విడుదల

కోడూరు: మండలంలోని దిగువ కాలువలకు మంగళవారం సాగునీటిని విడుదల చేశారు. పులిగడ్డ వద్ద విడుదల చేసిన సాగు, తాగు నీరు కోడూరుకు చేరుకుంది. దీంతో కోడూరు రెగ్యులేటర్ వద్ద ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు లాకులను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ముందుగా శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం 13వ నంబర్ పంట కాలువలో ఉన్న అడ్డంకులను తొలగించడానికి పొక్లెయిన్‌తో పనులను ప్రారంభించారు. నీటి సంఘాల అధ్యక్షుడు ఇజ్జినేని శివాజీ, గంజాల సుందరరావు, ఇరిగేషన్ ఏఈ విజయకుమార్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న ఎంపీడీఓ అనూహ్య



గూడూరు: ఏపీఎస్ఐఆర్డీలో 5 నెలల శిక్షణ కాలాన్ని పూర్తి చేసుకున్న గూడూరు ఎంపీడీఓ టి.అనూహ్య మంగళవారం తిరిగి విధులలో చేరారు. ఘంటసాల ఎంపీడీఓగా పనిచేస్తూ దీర్ఘకాలిక సెలవులో ఉన్న ఆమె ఈ ఏడాది జనవరి 25న గూడూరు ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు. ఫిబ్రవరి 2 నుంచి ఏపీఎస్ఐఆర్డీ శిక్షణకు వెళ్లారు. ఐదు నెలల శిక్షణకాలం ముగియడంతో మంగళవారం ఆమె గూడూరు ఎంపీడీఓగా చార్జి తీసుకున్నారు.

రెండు గంటల పాటు మొరాయించిన ఈ పోస్ యంత్రాలు

పెడన: రేషన్ దుకాణాల్లో రేషన్ తీసుకునేందుకు లబ్ధిదారులు పరేషన్ పడుతూనే ఉన్నారు. కూలి పనులకు పోయే వారు ఉదయమే ఇంటి పనులు పూర్తి చేసుకుని రేషన్ తెచ్చేసుకుని పనికి పోవాలనుకునే లబ్ధిదారులకు అటు పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. ఒకటో తేదీ ఉదయం రేషన్ తెచ్చుకునేందుకు వెళ్లిన వారికి ఈ పోస్ యంత్రం ఆన్‌లైన్ అందకపోవడంతో సర్వర్ లభించని పరిస్థితి. సుమారు రెండు గంటల తరువాత సర్వర్ లభించడంతో రేషన్ పంపిణీ మొదలు పెట్టారు. ఇలా అయితే ఎప్పుడు తీసుకోవాలి, ఎంత సేపు ఉండాలంటూ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేసిన ఏవో



పెడన: మండల పరిధిలోని నడుపూరు గ్రామంలో ఆదిత్య విత్తనాల దుకాణాన్ని మండల వ్యవసాయశాఖాధికారి(ఏవో) ఎస్.జెన్నీ మంగళవారం తనిఖీ చేశారు. విత్తనాల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించిన పిమ్మట ఆమె కొన్ని విత్తనాల శాంపిల్స్‌ను తీసుకుని ల్యాబ్‌కు పంపించారు. విత్తనాల ధరల పట్టికను ప్రదర్శించాలని దుకాణ యజమానికి సూచించారు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు.


స్కంధ షష్టికి పోటెత్తిన కార్తికేయుని ఆలయం

మోపిదేవి: స్కంధ షష్టి సందర్భంగా మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం భక్తజనంతో పోటెత్తింది. మంగళవారం తెల్లవారుజామునుంచే తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ప్రధాన రహదారుల్లో భక్తులు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా క్యూలైనులో భక్తులకు మజ్జిగ, మంచినీళ్లు సరఫరా చేశారు. మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణారావు మంగళవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల ర్యాలీ

అవనిగడ్డ: జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ డీఈ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక ఏఈలు ఎస్‌వీవీ సత్యనారాయణ, కె.గోపీచంద్, జీవీ రాజుతో పాటు పలువురు లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కృత్తివెన్ను ఎంపీడీవోగా అరుణకుమారి



కృత్తివెన్ను: కృత్తివెన్ను మండల పరిషత్ అధికారిగా ఎం.అరుణకుమారి మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. పెడన ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆమె కృత్తివెన్ను ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వర్తించనున్నారు. అరుణకుమారికి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేసిన సున్నా వెంకటేశ్వరరావు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. గత కొన్ని నెలలుగా మండలానికి రెగ్యులర్ ఎంపీడీవో లేరు. మండలానికి రెగ్యులర్ ఎంపీడీవో పోస్టును కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

పన్నులు ముద్దు.. దారి అడగొద్దు

- మచిలీపట్నం మునిసిపల్ కార్యాలయంలోకి వెళ్లాలంటే కష్టమే
- కమిషనర్ తీరుతో ఇబ్బందులు
- ప్రధాన రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- పెరిగిన ట్రాఫిక్ సమస్య
- పక్కనే ఆర్ పేట పోలీస్‌స్టేషన్ అయినా...పట్టించుకోని వైనం
- కార్యాలయంలోకి వెళ్లాలంటే ప్రజలకు తప్పని ఇక్కట్లు





ఎంఎంసీ కార్యాలయం ముందు రోడ్డుపై ద్విచక్రవాహనాలు ; ఎంఎంసీ కార్యాలయ ప్రధాన ద్వారం మూసివేయటంతో రోడ్డుపై నిలిపిన ద్విచక్ర వాహనాలు

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నగరపాలక సంస్థ కార్యాలయం ఓ ప్రైవేటు కార్యాలయంగా మారినట్లు నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. కార్యాలయం ఏర్పాటైన నాటి నుంచి పలు పనులపై వచ్చే ప్రజలు వారి వాహనాలను ఆవరణలో నిలిపివేసేవారు.

కమిషనర్ ఆదేశాలతో..

అయితే కొద్ది రోజులుగా కమిషనర్ బాపిరాజు ఆదేశాలతో సిబ్బంది కొత్త పద్ధతిని అమలు చేస్తున్నారు. కార్యాలయానికి రెండు గేట్లు ఉండగా ప్రధాన ద్వారం వద్ద డ్రెయిన్‌పై ఉన్న సిమెంట్ పలకలను తొలగించి గేటుకు తాళాలు పెట్టి రాకపోకలను పూర్తిగా నిలుపుచేశారు. దీంతో ఈశాన్యం వైపు ఉన్న మరో గేటునే వినియోగిస్తున్నారు. ఈ గేటు ద్వారానే కార్యాలయంలో వివిధ పనులపై, పన్నులు చెల్లించేందుకు వచ్చే ప్రజలు వారి వాహనాలను కార్యాలయ ఆవరణలోనే నిలిపేవారు. ఇక్కడ వాహనాలను అడ్డదిడ్డంగా పెట్టకుండా నియంత్రించేందుకు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. వారు రోజంతా వాహనాలను సక్రమంగా పెట్టించేవారు.

ప్రధాన రహదారిపైనే వాహనాల పార్కింగ్

నగరపాలకసంస్థ కమిషనర్ బాపిరాజు కొత్త నిబంధన పెట్టటంతో వాహనదారులకు, కార్యాలయంలోకి వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. కార్యాలయానికి వచ్చే వారు వారి ద్విచక్ర వాహనాలను ప్రధాన రహదారి మార్జిన్‌లోనే పెట్టి వచ్చేలా కొత్త రూల్‌ను అమలు చేయిస్తున్నారు. ఈశాన్యం వైపున ఉన్న ద్వారం గేటు ఒక్క మనిషి మాత్రమే పట్టే విధంగా ఇనుప గొలుసును కట్టించారు. దీంతో ఈ చిన్న పాటి సందు నుంచే ప్రజలు కార్యాలయంలోకి రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు రోడ్డు మార్జిన్‌లో రెండు వరుసలుగా పెట్టే సరికి అవి రోడ్డుపైకి చేరుతున్నాయి. ప్రధాన రహదారి కావటంతో సాధారణంగానే వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ఆపైగా ఎంఎంసీ కార్యాలయం వద్ద ద్విచక్ర వాహనాలను రోడ్డు పైవరకూ పెడుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

పక్కనే ఆర్.పేట పోలీస్‌స్టేషన్.. అయినా

కార్యాలయం పక్కనే ఆర్.పేట పోలీస్ స్టేషన్ ఉంది. ద్విచక్ర వాహనాలు రోడ్డుపైకి వచ్చి ట్రాఫిక్ సమస్య వస్తున్నా పోలీసులు పట్టించుకోవటం లేదు. పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ఓ ప్రైవేటు ఖాళీ స్థలంలో ఈ వాహనాలను నిలపాలని ఎంఎంసీ సిబ్బంది సూచిస్తున్నా ఎవరూ పట్టించుకోకుండా రోడ్డు మార్జిన్‌లోనే వారి ద్విచక్ర వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది.

ఉద్యోగులకు, ప్రజలకూ ఇబ్బందే..

ఈశాన్యం గేటు ముందు కూడా నడిచేందుకు వీలు లేకుండా ద్విచక్ర వాహనలను నిలుపు చేస్తుండటంతో కార్యాలయం లోపలకు వెళ్లే ప్రజలకు ఇబ్బంది తప్పటం లేదు. కమిషనర్ కారుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధుల కార్లు, ద్విచక్రవాహనాలను సైతం రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని కార్యాలయానికి వస్తున్న ప్రజలు వాపోతున్నారు.

స్పందించాలని వినతి

ఇప్పటికైనా కమిషనర్ స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ద్విచక్ర వాహనాలు కార్యాలయ ఆవరణలో పెట్టేందుకు కమిషనర్ అనుమతిని ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

వివాదాస్పద భూమిని సందర్శించిన ఆర్డీఓ



బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి పంచాయతీ శివారు అర్థావానిగూడెం గ్రామ పరిధిలో ఉన్న ఆర్.ఎస్.నెం. 586లో ఉన్న వివాదాస్పద భూమిని బందరు ఆర్డీఓ స్వాతి మంగళవారం సందర్శించారు. ఆ భూమిపై హక్కుల కోసం ముగ్గురు వ్యక్తులు గొడవలు పడుతున్నారు. వారు ఒకరిపై ఒకరు మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో పలువురు గాయాలపాలయ్యారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ స్వాతి పలువురు పోలీసు ఉన్నతాధికారులతో కలసి వివాదంలో ఉన్న భూమిని, రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ రికార్డుల మేరకు ఈ సర్వే నంబరుపై ఉన్న నాలుగు సబ్ డివిజన్లను సర్వే చేయించి సరిహద్దు రాళ్లు వేయించారు. ఈ సబ్ డివిజన్ల భూమిలో ఎవరు హక్కు పత్రాలతో ఉన్నారో వారిని ఆన్‌లైన్ చేయాలని మండల అధికారులను ఆదేశించారు. గతంలో జరిగిన కొట్లాట నేపథ్యంలో బందరు డీఎస్పీ సి.హెచ్.రాజ పర్యవేక్షణలో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేయరు వర్మ, పెడన సీఐ నాగేంద్రప్రసాదు, తహసీల్దార్ కె.పూర్ణచంద్రరావు, ఎస్ఐ గణేష్‌కుమార్, ఆర్ఐ బి.శివశంకర్ పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ అంత్యక్రియలో పాల్గొన్న పేర్ని కిట్టు



కోనేరుసెంటర్: మచిలీపట్నం శారదానగర్ లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన దాలిపర్తి పవన్ కళ్యాణ్ అంత్యక్రియల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పేర్ని కిట్టు పాల్గొన్నారు. కిట్టు సోమవారం ఉదయం బందరు మండలం చిన్నాపురం గ్రామంలోని పవన్ కళ్యాణ్ గృహానికి చేరుకుని అతని భౌతికకాయాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పవన్ కుటుంబానికి అండగా నిలవాలని పార్టీ నాయకులకు సూచించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్న కిట్టు గ్రామస్తులతో కలిసి పవన్ పాడెను మోశారు. కార్యక్రమంలో చిన్నాపురానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాలు బంద్



తాళం వేసి ఉన్న నందిగామ గ్రామ సచివాలయం



తలుపులు బార్లా తెరిచి ఉన్న పెనుమల్లి సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కేబిన్లు

- సిబ్బంది అంతా పింఛన్ల పంపిణీకి...
- తలుపులు బార్లా తెరిచి వెళ్లిపోయిన పెనుమల్లి సచివాలయ ఉద్యోగులు
- తాళం వేసి వెళ్లిన నందిగామ సచివాలయం సిబ్బంది
- పనులపై వచ్చి వెనుదిరిగి పోతున్న గ్రామస్తులు

పెడన: సచివాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులందరూ సామాజిక పింఛన్లు పంపిణీ చేయాల్సిందేనని ఎన్డీయే కూటమి సర్కారు స్పష్టం చేయడంతో ఆయా గ్రామ సచివాలయాలకు తాళాలు పడుతున్నాయి. కొన్ని చోట్ల తలుపులు తెరిచి వెళ్లిపోతున్నారు. మధ్యాహ్ననికే పింఛన్లు పంపిణీ 90 శాతం పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు చోడవరం, పెనుమల్లి, నందిగామ గ్రామ సచివాలయాలను 'సాక్షి' పరిశీలించింది. చోడవరంలో డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి అరుణ్‌కుమార్ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఏఎన్ఎం అక్కడే ఫ్యామిలీ కాన్సెప్ట్ ప్రోగ్రాంలో విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన వారెవరూ కనిపించలేదు. పింఛన్ల పంపిణీకి వెళ్లారని చెప్పారు. పెనుమల్లి గ్రామ సచివాలయం తలుపులు బార్లా తెరిచేసి ఉన్నాయి. సిబ్బంది ఎవరూ లేరు. లోపల విలువైన కంప్యూటర్లు, ఇతర సామగ్రి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకం. పనిపై వచ్చిన వారు తలుపులు తెరిచి ఉన్నాయనే ఉద్దేశంతో వేచి చూసి చూసి వెళ్లిపోయారు. నందిగామ గ్రామ సచివాలయానికి ఏకంగా తాళాలు వేసేశారు. బయట నుంచే చూసి గ్రామస్తులు వెనుదిరుగుతున్నారు. తాళాలు వేసి ఉండటం, సచివాలయ సిబ్బంది లేకపోవడంపై ఎంపీడీవో ఎ.అరుణకుమారి దృష్టికి తీసుకువెళ్లగా పింఛన్ల పంపిణీ బాధ్యత అందరికీ అప్పగించారని, అందువల్ల ఎవరూ ఉండటం లేదన్నారు. వాస్తవంగా సచివాలయంలో ఎవరినైనా పెట్టాలని, ఇక నుంచి ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నలుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు



విన్నకోట సాయిలక్ష్మీదుర్గ



పామర్తి జోషిక



బస్వాని రామ్‌తేజ్



చల్లా విశ్వనాథ్

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించినట్లు ఎంఈఓ వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెందుర్రు, బంటుమిల్లి, చోరంపూడి హైస్కూలు విద్యార్థులు విన్నకోట సాయిలక్ష్మీదుర్గ, పామర్తి జోషిత, బస్వాని రామ్‌తేజ్(ఒంగోలు), కంచడం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి చల్లా విశ్వనాథ్(శ్రీకాకుళం) సెంటర్లలో సీట్లు దక్కించుకున్నారని ఎంఈఓ తెలిపారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు దక్కించుకున్న విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పరిసరాలు పరిశుభ్రతగా ఉండాలి

నందమూరులో అధికారులతో కలెక్టర్ భేటీ



నందమూరు గ్రామ సచివాలయంలో అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పెడన: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌గా మండలంలోని నందమూరు గ్రామం ఎంపికవడంతో ఈ నెల 3న గ్రామానికి సెంట్రల్ టీం రానుంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ డీకే బాలాజీ మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో మంగళవారం గ్రామ సచివాలయంలో భేటీ అయ్యారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద జంగిల్ క్లియరెన్సులు చేసిందీ లేనిది అడిగి తెలుసుకున్నారు. వీధి లైట్లు, ప్రత్యేకంగా శానిటేషన్ వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు. జూలై 3న సెంట్రల్ టీం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉంటారని, సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక అధికారి పద్మావతి, మచిలీపట్నం డీఎల్‌పీవో రజావుల్లా, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్యకు ఘన నివాళి



ఘంటసాల: ఘంటసాల చరిత్రను రచించి భవిష్యత్తు తరాలకు అందించిన మహోన్నత వ్యక్తి పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య అని పలువురు కొనియాడారు. ఘంటసాల గ్రామానికి చెందిన పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘంటసాల ఐటీఐ కాలేజీ రోడ్డులోని వెంకట సుబ్బయ్య విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఘంటసాల బృందం సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పండిత వెంకట సుబ్బయ్య రచించిన ఘంటసాల చరిత్ర పుస్తకాలను అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందించాలని కోరుతూ ఆ పుస్తకాలను తహసీల్దార్ బి.విజయ ప్రసాద్‌కు గొర్రెపాటి రామకృష్ణ అందించారు. కార్యక్రమంలో గొర్రెపాటి సురేష్, వేమూరి రత్న శేఖర్, పోతన లక్ష్మీశ్వర రావు, వడ్లమూడి వెంకట కృష్ణారావు, దోనేపూడి అహోబల రావు, వడ్లమూడి ప్రసాదరావు, పోతన వెంకటేశ్వరరావు, పరుచూరి గోపాలకృష్ణ, డీటీ కనకదుర్గ, రీ సర్వే డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కేఈబీ కెనాల్ నుంచి కాలువకు నీరు విడుదల

శ్రీకాకుళం(ఘంటసాల): వ్యవసాయ పనులు సాగుతున్న నేపథ్యంలో రైతులకు సాగునీరు విడుదల చేస్తున్నట్లు శ్రీకాకుళం డీసీ వైస్ చైర్మన్ సుగ్గున రాంబాబు తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం కేఈబీ కెనాల్ నుంచి 2వ నంబర్ కాలువకు డీసీ వైస్ చైర్మన్ రాంబాబు మంగళవారం సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ కోడి రాధాకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ కొమరగిరి నాగిని, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్, జేఎస్పీ నేతలు కె.రాజశేఖర్, సుగ్గున పవన్ కుమార్, నీటి సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి వార్షిక మహోత్సవాలు

చల్లపల్లి: స్థానిక శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో మంగళవారం 7వ వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం నుంచి నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని సీఐ కె.ఈశ్వరరావు, ఉపసర్పంచ్ ముమ్మనేని రాజ్‌కుమార్(నాని) ప్రారంభించారు. సుమారు 3వేల మందికి పైగా భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. మోర్ల రాంబాబు, అడపా రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

7న చెట్లకు వేలంపాట

కోనేరుసెంటర్: కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన బందరు మండలం తపసుపూడి గ్రామంలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (పాత డీటీసీ) ఆవరణలో ఉన్న కొన్ని విలువైన మొక్కలకు వేలంపాట నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మంగళవారం తెలిపారు. అదే రోజు బందరు మండలం కరగ్రహారంలోని కొత్త పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఆవరణలో మొక్కలకు వేలంపాట నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏడవ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

అక్టోబర్ 15 వరకూ ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు



శ్రీకాకుళం(ఘంటసాల): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 15వ తేదీ వరకూ కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు చేపడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తాళ్లూరి శ్రీవిద్య హెచ్చరించారు. ముదిరాజ్ ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యులు తమ భూముల్లో రాత్రివేళలో ఇసుక తవ్వకాలు చేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో మంగళవారం రాత్రి ఆమె ఇసుక క్వారీని పరిశీలించారు. ఆ సమయంలో ఎలాంటి తవ్వకాలు జరగకపోవడంతో సభ్యులతో మాట్లాడుతూ మీ భూముల ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే అక్రమ తవ్వకాలు చేస్తే తెలుస్తాయని సూచించారు. తొలుత డీఎస్పీ చల్లపల్లి మండల పరిధిలోని ఆముదార్లంక ఇసుక క్వారీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సీఐ రమణమ్మకు ఎస్పీ అభినందన

కోనేరుసెంటర్: గుడివాడ సీసీఎస్ పోలీస్ స్టేషన్లో సీఐగా విధులు నిర్వహిస్తున్న గింజరపు రమణమ్మను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అభినందించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు చెన్నై భారతీ విద్యా భవన్ మైలాపూర్‌లో సీఐ రమణమ్మకు ఇటీవల గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి సేవారత్న అవార్డుతో సత్కరించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ సోమవారం రమణమ్మను తన కార్యాలయంలో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి గృహోపకరణాలు పంపిణీ

చల్లపల్లి: అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితురాలు కొడాలి ఝాన్సీకి బెతెల్ మినిస్ట్రీస్ సంఘ సభ్యులు మంగళవారం గృహోపకరణాలను అందజేశారు. మండల పరిధిలోని వెలివోలు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కొడాలి ఝాన్సీ తన ఇంటిని కోల్పోయింది. విషయం తెలుసుకున్న మినిస్ట్రీస్ సభ్యులు ఇనుప బీరువా, గ్యాస్ పొయ్యి, నాలుగు కుర్చీలు మొత్తం రూ.14వేలు విలువ చేసే సామగ్రిని అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అవనిగడ్డ: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం 32 మంది లబ్ధిదారులకు రూ.12.23 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం

మోపిదేవి: మూడున్నర దశాబ్దాల పాటు పాఠశాలలో స్టాఫ్ నర్స్‌గా సేవలు అందించిన ఇళ్ల మునిరత్నం తన శేషజీవితాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలని పులిగడ్డ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌టీపీ కుమార్ ఆకాంక్షించారు. మండలంలోని ఎంజేపీఏపీ గురుకుల పాఠశాలలో స్టాఫ్ నర్స్ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మునిరత్నం దంపతులకు శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువాలు కప్పి, భారీ పూలమాలతో ఘనంగా సత్కరించారు.

చివరి భూముల వరకు సాగునీరు

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

గుడ్లవల్లేరు: చివరి వ్యవసాయ భూముల వరకు సాగునీరు అందిస్తామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. కౌతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలోని గుడ్లవల్లేరులో మంగళవారం లాకులను వదిలి ఆయన సాగునీరును అందించి పూజలు చేశారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరావు, ఏఈ తులసి, శీరం ప్రసాద్, శలపాటి ప్రసాద్, లాకు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి

మచిలీపట్నంటౌన్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి పాత కార్మిక చట్టాలనే అమలు చేయాలని పలు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. స్థానిక బుట్టాయిపేటలోని సీఐటీయూ జిల్లా ఆఫీసులో కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐసీఈయూ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ యూనియన్ల ప్రతినిధులు పాల్గొని 9వతేదీ సమ్మెకు మద్దతు తెలిపారు.

పీహెచ్‌సీలో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

ఘంటసాల: ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్లు వేమూరి ప్రమోద్ కుమార్, టి.వెంకటేశ్వరరావులను వైద్య సిబ్బంది దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శివకృష్ణ, పూర్ణచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన డాక్టరు వేషాలు అలరించాయి. పాఠశాల డైరెక్టర్ కె.కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యుడు జగదీష్‌కు సన్మానం

మచిలీపట్నంటౌన్: జాతీయ డాక్టర్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం వాసవి క్లబ్, వాసవి క్లబ్ వనిత, వాసవి కపుల్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో వైద్యుడు లక్ష్మీ జగదీష్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే చార్టెడ్ అకౌంట్స్ డే సందర్భంగా అకౌంటెంట్ గొంట్లా శ్రీనివాస్ రావు (గుప్తా)ను కూడా క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమాల్లో ఆయా క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈనెల 31 వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం

చల్లపల్లి: నున్న-గుడివాడ 220 కేవీ విద్యుత్ లైన్ల ఆధునికీకరణలో భాగంగా ఈనెల 31వ తేదీ వరకూ కృష్ణాజిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మరమ్మతు పనులు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కారణంగా గుడివాడ విద్యుత్ ఉపకేంద్రలోని 220 కేవీకి సంబంధించిన ఒక సర్క్యూట్‌ను తాత్కాలికంగా ఆపివేయనున్నట్లు పేర్కొన్నారు. తప్పనిసరి అయిన పక్షంలో గుడివాడ, పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోట విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

స్వామివారి నిత్యాన్నదానంకు రూ.50,116 విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానంకు రావులపాలెం ఊబలంక గ్రామ వాస్తవ్యులు కొవ్వూరి రామకృష్ణారెడ్డి, ఉమారాజశ్రీ దంపతుల కుమార్తె జయిత్రి శ్రీషణ్ముఖ పేరున రూ.50,116 విరాళంగా సమర్పించారు. మంగళవారం ఉదయం ఆలయానికి చేరుకున్న వారు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించిన అనంతరం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు విరాళాన్ని అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.